సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



చదువుల పండగకు సర్వం సిద్ధం

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయంలో చదువుల పండగ పేరుతో ఆదివారం నుంచి 4వ తేదీ వరకూ మహాక్రతువులు నిర్వహించనున్నారు.


II లో



అంతర్వేదిలో గొప్పగా..

అంతర్వేది ఉత్సవాలంటే కనులకు వైకుంఠమే.. అలాంటి వేడుకలకు సమయం దగ్గర పడడంతో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 7,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.55 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఆటోను ఢీకొన్న లారీ

- ఒకరి మృతి, మరో నలుగురికి గాయాలు
- ఆటోనగర్ వద్ద ఘటన

రాజానగరం: జాతీయ రహదారిపై ఆటోనగర్ వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరానికి చెందిన బోడపాటి సోమరాజు (80), భార్య అచ్చియమ్మ, మేనల్లుళ్లు దొమ్మేటి అర్జునరావు, దొమ్మేటి సత్యనారాయణతో కలిసి కటారి మల్లిబాబు ఆటోలో బెండపూడిలో బంధువుల ఇంట జరిగిన అపరకర్మకు వెళ్లారు. ఆ కార్యక్రమం అనంతరం తిరిగి వస్తున్న వారిని ఆటోనగర్ వద్ద వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో సోమరాజు అక్కడికక్కడే మృతి చెందగా, అతడి భార్య, ఇద్దరు మేనల్లుళ్లతో పాటు ఆటో నడుపుతున్న మల్లిబాబు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దొమ్మేటి అర్జునరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రియా కుమార్ తెలిపారు.

వెంకన్న స్వామీ.. సదా స్మరామి

- వాడపల్లికి పోటెత్తిన భక్తజనం
- ఒక్కరోజే రూ.33.62 లక్షల ఆదాయం


కొత్తపేట: కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి అన్నిదారుల నుంచి భక్త ప్రవాహం వాడపల్లి క్షేత్రానికి ప్రవహించింది. శనివారం తెల్లవారుజామున అర్చక స్వాములు స్వామివారి సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభించారు. స్వామివారిని అభిషేకాలు, పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వారితో పాటు, ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులతో క్షేత్రం కిక్కిరిసిపోయింది. మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి తమ కోర్కెలు నెరవేరాలని వేడుకున్నారు. స్వామిని దర్శించుకుని మురిసిపోయారు. ముందుగా భక్తులు గౌతమీ గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అలాగే ఆలయ ఆవరణలో వేంకటేశ్వర స్వామి క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామిని దర్శించుకున్నారు. దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది, స్థానిక స్వామివారి సేవ వలంటీర్లు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ ఒక్కరోజు స్వామి వారికి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, సేవలు, లడ్డూ విక్రయం, ఆన్‌లైన్ సేవల ద్వారా రూ.33,62,453 ఆదాయం సమకూరినట్టు డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు. ఎస్సై రాము ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బందోబస్తు నిర్వహించారు.

శనైశ్చర స్వామికి తైలాభిషేకాలు

శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో వేంచేసియున్న ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తైలాభిషేకాలు జరిపారు. దేవస్థానానికి తైలాభిషేకాల ద్వారా రూ.1,22,390, అన్న ప్రసాద విరాళాలుగా రూ.27,496 వచ్చిందని దేవదాయ శాఖ డీసీ, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ప్చ్.. నిరాశే..





- కేంద్ర బడ్జెట్‌తో ఒరిగింది శూన్యం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు ఎంపీగా ఉన్నా.. ఈ ప్రాంతానికి మొండిచేయే
- వ్యవసాయాధారిత జిల్లాలో రైతులకు దక్కని ప్రోత్సాహం
- ఉపాధికి కేటాయింపులు అరకొరే..
- కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

సాక్షి, రాజమహేంద్రవరం: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ బడ్జెట్ తీవ్ర నిరాశకు గురి చేసిందని పలువురు అభిప్రాయపడ్డారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేనతో కూడిన ఎన్‌డీఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రాజమహేంద్రవరం ఎంపీగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర బడ్జెట్‌లో ఈ ప్రాంతానికి వరాలు కురుస్తాయని జిల్లా ప్రజలు భావించగా.. వారి ఆశలపై కేంద్ర బడ్జెట్ నీళ్లు జల్లింది. తన పార్లమెంటరీ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు సాధించుకోవడంలో పురందేశ్వరి శ్రద్ధ చూపకపోవడమేమిటనే ప్రశ్న రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది. తమ మద్దతుతోనే కేంద్ర ప్రభుత్వం నడుస్తోందన్న బీరాలు పలుకుతున్న టీడీపీ, జనసేన నేతలు బడ్జెట్‌లో జిల్లాకు కేటాయింపులపై ఎందుకు దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం కేంద్రం ఇచ్చిన నిధులను దేహీ అంటూ తీసుకోవడం తప్ప డిమాండ్ చేసే పరిస్థితి లేకపోవడం దారుణమని అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీ, బిహార్ రాష్ట్రాలకు త్వరలో జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందించారు తప్ప.. ఈ బడ్జెట్ ప్రజల కోసం కాదని పలువురు విమర్శిస్తున్నారు.

గోదావరి పుష్కరాలపై కరుణేదీ?

గోదావరి పుష్కరాలు 2027లో జరగనున్నాయి. ఈ సందర్భంగా మహారాష్ట్రలోని నాసిక్, తెలంగాణలోని వివిధ ప్రాంతాలతో పాటు మన రాష్ట్రంలోని అంతర్వేది, పుదుచ్చేరి పరిధిలోని యానాం వరకూ పావన గోదావరి నదిలో పుణ్య స్నానాలు చేస్తారు. దేశ, విదేశాల నుంచి కోట్లాది మంది యాత్రికులు తరలివస్తారు. వీరిలో అత్యధికులు రాజమహేంద్రవరంలో పుష్కర స్నానాలు చేయడానికి, తీర్థ విధులు నిర్వహించడానికే మొగ్గు చూపుతారు. ఈ సందర్భంగా నగరంతో పాటు, కొవ్వూరు తదితర ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు రూ.1,286 కోట్లు అవసరమని ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రతిపాదనలు పంపారు. దీనికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారేమోనని భావించారు. కానీ, ఆ ప్రస్తావనే ఎక్కడా లేకపోవడం గమనార్హం.

అన్ని వర్గాల వారికీ అనువైన బడ్జెట్



ఇది అన్ని వర్గాల వారికీ అనువైన బడ్జెట్. ఇన్‌కం ట్యాక్స్ బెనిఫిట్లు బాగున్నాయి. ఉద్యోగులకు, వ్యాపారులకు అన్ని రకాల ప్రయోజనాలు అందించేలా ఈ బడ్జెట్ ఉంది.

– మద్దుల మురళీకృష్ణ, మాజీ సెక్రటరీ, ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్, రాజమహేంద్రవరం

ధరలు పెరిగే అవకాశం



ఫిస్కల్ డెఫిసిట్ 4.8 శాతం ఉందని కేంద్రం ప్రకటించింది. ఆ లోటును భర్తీ చేయాలంటే అంత మేర కరెన్సీ నోట్లు ప్రింట్ చేయాలి. దీనిని బట్టి చూస్తుంటే ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది. కేంద్రానికి ఇన్‌కం ట్యాక్స్ ద్వారా 22 శాతం వస్తుందని చెప్పారు. ఇది ఎలా అంచనా వేశారనే దానిపై సందిగ్ధత నెలకొంది. వేతనాలు ఏమైనా పెరిగే అవకాశం ఉందా అనేది చూడాలి. ట్యాక్స్ లిమిట్ పెంచారు. తద్వారా సేవింగ్స్ పెరిగే అవకాశం ఉంటుంది. మధ్య తరగతి ప్రజలకు కొంత ఊరట కలగనుంది. కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితిని రూ.5 లక్షలకు పెంచడం మంచి పరిణామం. ఉత్పత్తిని పెంచేందుకు ఎలాంటి ఇబ్బందులూ లేవు. వ్యవసాయంపై అంతగా దృష్టి పెట్టలేదు. పారిశ్రామికవేత్తలకు మద్దతు ఇస్తామని చెప్పారు. అది ఎలాగనేది స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

– డాక్టర్ పి.లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, నన్నయ యూనివర్సిటీ

ఆదాయపన్ను తగ్గింపులో మతలబు!

బడ్జెట్‌లో ఆదాయ పన్ను రాయితీ ఇచ్చినా.. పెరిగే ధరలతో మధ్య తరగతి వర్గం జేబులు ఖాళీ కానున్నాయి. పన్నుల భారం పెంచేది కేంద్రమే, తగ్గిస్తున్నామని గొప్పలు చెప్పేది కేంద్రమేననే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే అధిక ధరలతో పేదలు, మధ్య తరగతి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో వస్తు, సేవల పన్ను(జీఎస్టీ), పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గించకుండా కేవలం కంటితుడుపుగా రూ.12 లక్షల వరకూ ఆదాయపన్ను మినహాయింపు అని ప్రకటించడంలో మతలబు ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కేవలం రూ.4 లక్షల వరకే ఇది వర్తిస్తుందని ఆర్థిక నిపుణులు వెల్లడిస్తున్నారు. కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి పెంచడం ద్వారా రైతులకు కొంత మేలు చేకూరుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తంగా ఈ బడ్జెట్ సామాన్యులకు పెనుభారంగా మారుతుందని పలువురు అంటున్నారు.

కలగానే కొవ్వూరు - భద్రాద్రి కొత్తగూడెం రైల్వే లైన్

జిల్లాలోని కొవ్వూరు నుంచి భద్రాద్రి కొత్తగూడెం వరకూ కొత్త రైల్వే లైను నిర్మాణం అంశం ఈ బడ్జెట్‌లోనూ అటకెక్కింది. ఈ రైల్వే లైను నిర్మాణాన్ని నాలుగు దశాబ్దాల క్రితమే ప్రతిపాదించారు. ఇటీవల ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

నిర్మాణ పనులపై ఉన్న అవకాశాలను శోధిస్తూ అధ్యయనం కూడా చేశారు. ఈ రైల్వే లైను నిర్మిస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని నివేదికలు సైతం స్పష్టం చేశాయి. దీనివలన విశాఖ – హైదరాబాద్ మధ్య 130 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుందని నిర్ధారించారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రైల్వే లైనుకు ఈ బడ్జెట్‌లో నయా పైసా కూడా కేటాయించలేదు.

కూటమి డొల్లతనానికి నిదర్శనం



కేంద్రంలో తిరిగి అధికార పగ్గాలు చేపట్టడంలో బీహార్, ఆంధ్రప్రదేశ్ కీలకంగా మారాయి. ఇలాంటి సమయంలో ఈ బడ్జెట్‌లో బీహార్‌కు అధిక మొత్తంలో నిధులు ఇచ్చారు. రాష్ట్రానికి ఇవ్వకపోవడానికి కారణమేమిటి? కేంద్ర ప్రభుత్వంలో తాము కీలకమన్న సీఎం చంద్రబాబు నాయుడు నిధులు సాధించలేకపోవడం కూటమి ప్రభుత్వ డొల్లతనానికి నిదర్శనం. 21 మంది ఎంపీలున్న కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు రాబట్టలేకపోవడం దారుణం.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

చంద్రబాబు, పవన్ సిగ్గుపడాలి



ఢిల్లీ, బీహార్ రాష్ట్రాల్లో త్వరలో జరిగే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్లో రాష్ట్రానికి మొండిచెయ్యి చూపించారు. రాజధానికి నిధులు కానీ, ప్రత్యేక హోదా ఊసు కానీ లేదు. ఈ బడ్జెట్ చూసి చంద్రబాబు, పవన్ సిగ్గుపడాలి. ఆదాయ పన్ను రాయితీ ఇచ్చినా.. పెరిగే ధరలతో మధ్య తరగతి జేబులు ఖాళీ అవుతాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రజలు ఉపాధి లేక పట్టణాలకు వలస వెళ్తున్నారు. కనీసం ఉపాధి హామీ పథకానికి కూడా నిధులు సరిగ్గా కేటాయించలేదు. ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర జరుగుతోంది. ఈ బడ్జెట్లో కార్పొరేట్ పారిశ్రామికవేత్తలకు మరోసారి ఫుల్ మీల్స్ పెట్టారు. – తాటిపాక మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి

ధరల అదుపు చర్యలేవీ?



ద్రవ్యోల్బణం అదుపు, వడ్డీ రేట్ల తగ్గుదల, ఉత్పత్తి పెరుగుదల లేకుండా స్థూల జాతీయ పెరుగుదల సాధ్యం కాదు. తక్కువ వడ్డీకి రుణాలు, బ్యాంకు రుణ నిబంధనలు సరళీకరించి, సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఉత్పత్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలి. ఆర్థిక లోటు, ద్రవ్యోల్బణం తగ్గకుండా రిజర్వు బాంక్ వడ్డీ రేట్లు తగ్గించడం కుదరదు. కేంద్ర ప్రభుత్వమే రెవెన్యూ వ్యయం తగ్గించి, పెట్టుబడులు పెంచే దిశగా చర్యలు చేపట్టాలి.

– సుంకవల్లి వెంకన్న చౌదరి, పారిశ్రామికవేత్త, ఛైర్మన్, సుంకవల్లి ఫౌండేషన్, మార్కొండపాడు, చాగల్లు

మొరాయించిన సర్వర్.. పింఛన్ల పంపిణీలో ఇబ్బంది



ఫించన్ పంపిణీ చేసి, వృద్ధుడికి నమస్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం కృష్ణా నగర్ ఆదెమ్మ దిబ్బ వద్ద సర్వర్ పని చేయక పెన్షన్ల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

రాజమహేంద్రవరం రూరల్: సర్వర్ మొరాయించడంతో జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో శనివారం ఉదయం ఇబ్బందులు తలెత్తాయి. సర్వర్ పని చేయకపోవడంతో పింఛన్లు పంపిణీ మందకొడిగా సాగింది. ప్రతి నెలా ఉదయం 7 గంటలకే 90 శాతం పూర్తయ్యేది. ఈసారి ఆ సమయానికి 66.14 శాతం మాత్రమే పంపిణీ జరిగింది. దీంతో సిబ్బంది మధ్యాహ్నం వరకూ పింఛన్లు పంపిణీ చేయాల్సి వచ్చింది. జిల్లావ్యాప్తంగా రాత్రి 9 గంటల సమయానికి 95.81 శాతం పింఛన్లు పంపిణీ చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బొమ్మూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కాపుల వీధిలో లబ్ధిదారులకు ఉదయం ఆమె పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. జిల్లాలో 2,36,331 మంది లబ్ధిదారులకు రూ.102.14 కోట్ల మేర పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం వరకూ 2,12,647 మందికి పంపిణీ చేశామన్నారు. ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, రూరల్ ప్రత్యేకాధికారి కేఎస్ జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ఈవో పీఆర్ అండ్ ఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శి కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

కోరుకొండ ఆలయం దత్తత ఉపసంహరించరూ..

- ప్రభుత్వానికి అన్నవరం దేవస్థానం వినతి
- వరుస వివాదాలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో లేఖ

అన్నవరం: తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం దత్తతను ఉపసంహరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి అన్నవరం దేవస్థానం వినతిపత్రం సమర్పించింది. అన్నవరానికి సుమారు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోరుకొండ దేవస్థానం నిర్వహణ తమకు కష్టసాధ్యంగా మారిందని ఆ వినతిలో పేర్కొన్నారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు ఈ విషయం విలేకర్లకు తెలిపారు. కాగా, ప్రస్తుతం దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్ర మోహన్ గతంలో అన్నవరం దేవస్థానం ఈఓగా ఉన్నప్పుడు కూడా ఇదేవిధంగా ప్రభుత్వానికి వినతి పత్రం పంపించారు. అయితే, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అప్పుడు దానిని అంగీకరించలేదు. కోరుకొండ దేవస్థానంలో జరుగుతున్న అనేక వివాదాలు అన్నవరం దేవస్థానం అధికారులకు తలనొప్పిగా మారాయి. మంచి జరిగితే ఆ దేవస్థానానికి, చెడు జరిగితే తాము పట్టించుకోవడం లేదనే అపవాదు వస్తోందని ఇక్కడి అధికారులు వాపోతున్నారు. కోరుకొండ ఆలయన నిర్వహణకు అన్నవరం దేవస్థానం ఏటా సుమారు రూ.50 లక్షలు ఖర్చు చేస్తోంది. గత ఏడాది సెప్టెంబర్‌లో కోరుకొండ దేవస్థానం నిధులు రూ.16 లక్షలు దుర్వినియోగం చేశారనే అభియోగంపై అన్నవరం దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ కె.సతీష్, రికార్డు అసిస్టెంట్ టి.అనిల్ కుమార్, కోరుకొండ దేవస్థానానికి చెందిన రికార్డు అసిస్టెంట్ టి.రవికుమార్‌లను అప్పటి ఈఓ రామచంద్ర మోహన్ సస్పెండ్ చేశారు. తరువాత ఆ నిధులు జమ చేయడంతో తిరిగి వారికి ఉద్యోగాలిచ్చారు. అయినప్పటికీ ఆ వివాదం పూర్తిగా సమసిపోలేదు. గత నెలలో కోరుకొండ దేవస్థానం కార్యాలయంలో మద్యం సీసాలు దర్శనమిచ్చాయని పత్రికల్లో వార్తలు వచ్చాయి. దీనిపై కూడా అన్నవరం దేవస్థానం అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రతిసారీ ఏదో ఒక వివాదం రావడం అన్నవరం దేవస్థానం అధికారులకు తలనొప్పిగా మారుతోంది. మరోవైపు అన్నవరం దేవస్థానం ఆర్థిక ఇబ్బందుల కారణంగా గతంలో మాదిరిగా నిధులు ఖర్చు చేసే అవకాశం లేదని, అందువలన దత్తత నుంచి ఉపసంహరించాలని కోరినట్లు సమాచారం.

ఊరిలోనే.. ఉపాధి బాట

- జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి 19 ఏళ్లు
- తొలిసారిగా వైఎస్సార్ హయాంలో అమలు
- కూలీల వలసల నివారణకు దోహదం
- టీడీపీ పాలనలో అక్రమాలకు నిలయం
- మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనలో నవోదయం



వెదురుమూడిలో తడిసిన ధాన్యాన్ని రైతు కోరిన చోటకు తరలిస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)



ఉపాధి పథకం ద్వారా శ్రమిస్తున్న కూలీలు

కపిలేశ్వరపురం: ఊరులోనే ఉపాధి దొరికితే అంతకన్నా ఆనందం ఉంటుందా... వలసల బాట లేకుండా, కూలి పనుల కోసం వెతుకులాడకుండా అందరికీ పనులు కల్పించే ఉద్దేశంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పురుడు పోసుకుంది.. పేదలకు ఈ పథకం ఎంతగానో ఆసరాగా నిలుస్తోంది. దేశంలో 2006కు ముందు గ్రామాల్లో పనులు లేక, పస్తులుంటూ జీవించిన కూలీలకు ఉపాధి కల్పించింది.. అప్పట్లో కేంద్రంలో ప్రధానిగా మన్మోహన్‌సింగ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎంగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన సాగుతున్న రోజుల్లో ప్రజల ముందుకు ఈ పథకం వచ్చింది. దీనికి 19 ఏళ్లు నిండింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక గ్రామాల అభ్యున్నతికి దోహదపడింది. ప్రజల మేలు కోరి పాలన సాగించిన మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఈ పథకం క్షేత్ర స్థాయిలో మెరుగైన ఫలితాలనిచ్చింది. ఒకప్పటి టీడీపీ పాలనలో ఉపాధి హామీ పథకం అక్రమాలకు నిలయంగా, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కాసులు కురిపించే పథకంగా మారింది. ప్రస్తుత కూటమి పాలనలో కూడా నిస్తేజంగా ఉంది.

పథకం ఉద్దేశమిది.. : ప్రతి కూలీకి ఏడాదికి వంద రోజులు పని కల్పించే లక్ష్యంగా ఎన్ఆర్ఈజీఎస్ పథకం రూపొందింది. పనిలేక ఆకలితో చనిపోయే పరిస్థితులను రూపుమాపడం, ఇతర ప్రాంతాలు, వృత్తులకు మళ్లిపోతున్న వారిని ఈ పథకం వైపు తీసుకెళ్లడం ప్రధాన ధ్యేయం. క్షేత్ర స్థాయిలో ప్రజలకు పని కల్పించి కనీస కూలి కల్పించాలన్న ఆలోచన 1991 పీవీ నరసింహారావు హయాంలోనే కేంద్ర ప్రభుత్వం చేసింది. తర్వాత కాలంలో మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న యూపీఏ ప్రభుత్వంలో పథకం కార్యాచరణ రూపం దాల్చింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 పేరుతో ఆగస్టు 23న బిల్లు ఆమోదమైంది. 2006 ఫిబ్రవరి 2న పథకం ప్రారంభమైంది. అలా ప్రారంభమైన ఉపాధి పథకానికి ఆదివారంతో 19 ఏళ్లు పూర్తవుతున్నాయి. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిధులు కేటాయిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో కూలీలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 18,53,328 మంది జనాభా ఉండగా మొత్తం 1.53 లక్షల జాబ్ కార్డులు ఇచ్చారు. 2.27 లక్షల మంది కూలీలు ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 18,43,903 జనాభా ఉండగా, 1,61,372 మందికి జాబ్‌కార్డులు ఇవ్వగా 1,11,815 మంది కూలీలున్నారు. కాకినాడ జిల్లాలో 22,55,668 మంది ప్రజలు ఉండగా, 1.96 లక్షల కార్డులకు 1.95 లక్షల మంది కూలీలున్నారు.

గత ప్రభుత్వంలో ముందుకు..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఉపాధి పథకాన్ని అభివృద్ధి పథకంలోకి తీసుకెళ్లారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ అనుబంధ, అభివృద్ధి పనులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూనే కూలీలతో పనులు చేపట్టే వాటికి మొదటి ప్రాధాన్యం ఇచ్చారు. ఉపాధి కూలీలకు పని కల్పనకే పరిమితం కాకుండా మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో అభివృద్ధికి బాట వేశారు. గ్రామ పాలనలో కీలకమైన సచివాలయం, రైతు భరోసా, పాల సేకరణ కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 467 గ్రామ, 48 వార్డు సచివాలయాలు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 445 గ్రామ, 175 వార్డు సచివాలయాలు, తూర్పుగోదావరి జిల్లాలో 393 గ్రామ, 119 వార్డు సచివాలయాలుండగా వాటిలో అనేక సచివాలయాలకు సొంత భవనాలు సమకూరాయి. ప్రతి పనినీ జియో ట్యాగింగ్ పద్ధతిలో చేసి పారదర్శక పాలనగా పేరు తెచ్చుకున్నారు. ఆధార్ అనుసంధానం చేసి కూలీలకు డబ్బు సక్రమంగా అందేలా డీబీటీ విధానాన్ని తీసుకొచ్చారు. పనులు చేసిన వెంటనే బిల్లులు సైతం జమ అవుతుండటంతో ఉపాధి పనులకు వస్తున్న కూలీల సంఖ్య పెరిగింది. అన్ సీజన్లో సైతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రోజుకు సుమారు 10 వేల మందికి పైగా ఉపాధి పొందగలిగారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణంలో 90 పనిదినాలకు సంబంధించిన పనులు చేపట్టారు. నీటి పారుదలకు ఆటంకం కలగకుండా చెరువులు, పంట, పిల్ల కాలువల పూడికతీత పనులు, గ్రామీణ రహదారుల అనుసంధానం, హార్టికల్చర్, ఎవెన్యూ ప్లాంటేషన్, హౌసింగ్ కాలనీల్లో మ్యాజిక్ సోక్ పిట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మురుగు నీరు బయటకు వెళ్లేలా కమ్యూనిటీ సోక్ పిట్ల పనులు చేపట్టారు. వరుస వర్షాలకు ధాన్యం తడిచి అయోమయంలో ఉన్న రైతుకు ఉపాధి పథకం కూలీలు తోడుగా నిలిచే అవకాశాన్ని గత సీఎం వైఎస్ జగన్ కల్పించారు. తడిచిన ధాన్యాన్ని రైతు కోరిన చోటకు తరలించడం ద్వారా కూలీలు సామాజిక సేవలో భాగస్వాములయ్యారు.

వైఎస్సార్ హయాంలో ఉద్యమంలా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉపాధి పథకం అమలు ఒక ఉద్యమంగా సాగింది. చెరువులు, పంట కాలువలు, బోదెలు తవ్వకాలతో పెద్ద ఎత్తున కూలీలకు పని కల్పించారు. ఉద్యానవన విభాగంలో ఉద్యాన తోటల పెంపకానికి అవకాశం కల్పించారు. ఇందిర జలప్రభ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గీయులకు చెందిన బీడు భూములను సాగు భూములుగా మార్చారు. తర్వాత కాలంలో టీడీపీ అధికారంలోకి రాగా ఉపాధి హామీ పథకం అక్రమాలకు నిలయంగా మారింది. నీరు-చెట్టు పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కాసుల వర్షం కురిపించింది. పని చేసిన కూలీలకు బకాయిలు పెట్టి నానా తిప్పలు పెట్టింది. చేసిన పనులు సైతం నాణ్యతా లోపంతో ఉండటంతో పథకం నిర్వహణ వివాదాస్పదమైంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడు నెలల పాలనలోనూ తీరు మారలేదన్న విషయం ఇటీవల గ్రామ, మండల స్థాయిలో నిర్వహించిన గ్రామసభల్లో వ్యక్తమైంది.

ఫీజు పోరును విజయవంతం చేయండి



ఫీజు పోరు దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు చెల్లుబోయిన వేణు, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

- 5న రాజమహేంద్రవరం తరలిరండి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు
- పోస్టర్ విడుదల

బిక్కవోలు: ఈ నెల 5న రాజమహేంద్రవరంలో చేపట్టనున్న ఫీజు పోరును విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. బిక్కవోలులో వైఎస్సార్ సీపీ మండల ముఖ్య నాయకులతో ఆయన, పార్టీ అనపర్తి నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి ఇంటి వద్ద జరిగిన ఈ సమావేశంలో మండలంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ, పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి మండలానికి ఒక గ్రామంలో మండల ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించి, సూచనలు, సలహాలు స్వీకరిస్తున్నానని చెప్పారు. ఇందులో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేశానన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతతో కొట్టుమిట్టాడుతోందని, సూపర్ సిక్స్ హామీల అమలులో కాలయాపన చేస్తోందని విమర్శించారు. నాలుగు విడతలకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రతి పేద విద్యార్థీ ఉన్నత విద్య అభ్యసించాలనే సమున్నత లక్ష్యంతో గత ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు పరిచారన్నారు. కూటమి ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారని చెప్పారు. అటువంటి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మద్దతుగా వైఎస్సార్ సీపీ ఈ నెల 5న రాజమహేంద్రవరంలో కలెక్టరేట్ వద్ద ఫీజు పోరు నిర్వహించనుందని, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని వేణు తెలిపారు. ఫీజు పోరును విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆ రోజు రాజమహేంద్రవరం తరలి రావాలని కోరారు. సమావేశంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్లు సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ బిక్కవోలు మండల అధ్యక్షుడు పోతుల ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ బుద్దాల కన్నారావు, ఉప సర్పంచి డాక్టర్ జంగా మురళీకృష్ణారెడ్డి, కాపవరం, రంగాపురం సర్పంచులు సత్యంశెట్టి వెంకట రమణ, గండికోట వీరభద్రరావు, పందలపాక సొసైటీ మాజీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,000 – 14,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్



చెస్‌లో రేటింగ్ సాధించిన విద్యార్థులు

అమలాపురం టౌన్: అమలాపురం విక్టరీ అకాడమీకి చెందిన మరో ముగ్గురు విద్యార్థులు చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్ సాధించారని ఆ అకాడమీ ప్రిన్సిపాల్, జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకటసురేష్ తెలిపారు. పెద్దాపురం జవహర్ నవోదయ స్కూల్‌లో చదువుతున్న కొండా శివేంద్ర 1,406 రేటింగ్ పాయింట్లు, అమలాపురం విద్యానిధి స్కూల్‌లో చదువుతున్న పితాని రాఘవేంద్ర 1,443, సాధనాల శ్రీసంతోష్ 1,494 రేటింగ్ పాయింట్లు సాధించారని అన్నారు. ఇంత వరకూ విక్టరీ అకాడమీకి చెందిన 30 మంది విద్యార్థులు రేటింగ్ సాధించారని వివరించారు. అంతర్జాతీయంగా రేటింగ్ సాధించిన విద్యార్థులను రాష్ట్ర చెస్ అసోసియేషన్ సెక్రటరీ కవురు జగదీష్, అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఆకుల బాపన్న నాయుడు అభినందించారు.

అంతర్వేదిలో గొప్పగా..



ప్రధాన ద్వారం వద్ద ఆకర్షణీయంగా అలంకరణ



ఆలయం వెలుపల ఐరన్ రాడ్లతో క్యూ లైను



ఆలయానికి ఉత్తరం వైపున తెప్పోత్సవానికి తాత్కాలిక చెరువు పనులు

అంతర్వేది ఉత్సవాలంటే కనులకు వైకుంఠమే.. అలాంటి వేడుకలకు సమయం దగ్గర పడడంతో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ నెల 4 నుంచి ప్రారంభం కానున్న లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆయా శాఖల ఆధ్వర్యంలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దేవాలయం, పరిసర ప్రాంతాల్లో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో క్యూ లైన్లు, డెకరేషన్ పనులు చేపట్టారు. ఆలయానికి ఉత్తరం వైపున స్వామివారి తెప్పోత్సవానికి తాత్కాలిక చెరువు తవ్వే పనులు వేగవంతం అయ్యాయి.

– సఖినేటిపల్లి



అంతర్వేదిలో కల్యాణ వేదిక ప్రాంతంలో తాటాకుల పందిరి

చదువుల పండగకు సర్వం సిద్ధం

- నేడు లక్ష కలాల పూజ
- అయినవిల్లిలో ఏర్పాట్లు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో చదువుల పండగ పేరుతో ఆదివారం నుంచి 4వ తేదీ వరకూ మహాక్రతువులు నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశామని ఆలయ ఈఓ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు శనివారం తెలిపారు. శ్రీపంచమి సందర్భంగా ఆదివారం గణపతి కల్ప ప్రారంభంతో సప్తనదీ జలాభిషేక సహిత లక్ష కలాల వితరణ మహోత్సవాలకు శ్రీకారం చుడతామన్నారు. స్వామివారి సప్తనదీ జలాభిషేకం కోసం సప్త నదులైన గోదావరి, గంగ, యమున, సరస్వతి, సింధు, కావేరి, నర్మద నుంచి ఆలయ అధికారులు జలాలు సేకరించారు. భక్తుల దర్శనార్థం ఆలయ మండపంలో సప్తనదీ జలాలు, లక్ష కలాలు ఉంచారు. జలాభిషేకం అనంతరం స్వామివారి పాదాల వద్ద లక్ష కలాలతో పూజలు చేసేందుకు వేద పండితులు ఏర్పాట్లు చేశారు. 3న సరస్వతీ కల్పం, 4న మహా పూర్ణాహుతి పూజలు ఉంటాయి. శ్రీపంచమి సందర్భంగా స్వామివారి సన్నిధిలో విద్యార్థులచే సరస్వతీ



విశేష అలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి

పూజలు చేయిస్తారు. ఈ వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారని ఈఓ తెలిపారు. లక్ష కలాలను విద్యార్థులకు ఈ నెల 8, 9 తేదీల్లో పంపిణీ చేస్తామన్నారు. స్వామి కలాలతో పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు వస్తాయనేది విద్యార్థుల నమ్మకం. అందుకే స్వామివారి కలాల కోసం విద్యార్థులు సుదూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఈ సారి కూడా స్వామివారి సప్తనదీ జలాలు, లక్ష కలాల వితరణ కార్యక్రమానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో సప్తనదుల నుంచి సేకరించిన జలాలు

భక్తులతో కిటకిట

స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో వేకువ జాము నుంచే ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి పంచామృత, లఘున్యాస అభిషేకాలు, శ్రీలక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రసన, తులాభారం జరిపారు. స్వామివారి అన్న ప్రసాదాన్ని 1,720 మంది భక్తులు స్వీకరించారు. ఈ ఒక్కరోజు వివిధ పూజా టిక్కెట్లు, ప్రసాదాలు, అన్నదాన విరాళాలు, తదితర వాటి ద్వారా రూ.2.44 లక్షల ఆదాయం సమకూరిందని ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.

కానిస్టేబుల్ నిజాయితీ

జగ్గంపేట: ఓ కానిస్టేబుల్ నిజాయితీ చాటుకున్నాడు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కథనం ప్రకారం.. జగ్గంపేటలో కాకినాడ ఏపీఎస్పీ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ తోట సూరిబాబు దుస్తులు కొనుగోలు చేశారు. అయితే దుస్తుల సంచితో పాటు రూ.8 లక్షలు ఉంచిన సంచిని కూడా సూరిబాబుకు ఆ వస్త్ర దుకాణ యజమాని శేక్ బబ్లూ అందజేశారు. ఇది గమనించని కానిస్టేబుల్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తరువాత పొరపాటును గమనించిన బబ్లూ జగ్గంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై రఘునాథరావు, రైటర్ కృపావరం తక్షణం స్పందించి సీసీ కెమెరాలు, ఫోన్ పే చేసిన నంబర్ ద్వారా నగదు కవరును పట్టుకుని వెళ్లిన వ్యక్తిని గుర్తించారు. అతను కాకినాడకు చెందిన కానిస్టేబుల్ కావడంతో అతనికి జరిగిన పొరపాటును వివరించారు. అది గమనించిన కానిస్టేబుల్ సూరిబాబు నిజాయితీగా నగదు ఉన్న సంచిని సీఐ, ఎస్సైలకు అందజేశారు. దానిని వారు షాపు యజమాని బబ్లూకి అందజేయడంతో అతను పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.



రూ.8 లక్షలను వస్త్ర దుకాణ యజమాని బబ్లూకు అందజేస్తున్న జగ్గంపేట సీఐ, ఎస్సై

కేసు నిర్వీర్యానికి కుట్ర

కరప: వాకాడ పాఠశాలలో కొందరి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు వీఎస్ రామారావు కేసును నిర్వీర్యం చేస్తున్నట్టు మానవ హక్కుల వేదిక శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. నిజ నిర్ధారణ కోసం వాకాడ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పోలీసులను కలసినట్టు ఆ సభ్యులు తెలిపారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులు కానీ ఏమీ చెప్పకపోవడం, కరప పోలీస్ స్టేషన్‌లో దీనికి సంబంధించి ఎటువంటి కేసు నమోదు కాకపోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. బాధితులు, తల్లిదండ్రులు నోరు తెరిచి చెప్పుకోకుండా కట్టడి చేసినట్టు ఆరోపించారు. నిజ నిర్ధారణ బృందంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, ఉపాధ్యక్షుడు ఎ.రవి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇక్బాల్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

పోలీసు లాంఛనాలతో మూర్తి అంత్యక్రియలు



కోటిపల్లి గోదావరి గట్టున పోలీసు లాంఛనాలతో మూర్తి అంత్యక్రియలు

కె.గంగవరం: తణుకులో తన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఎస్సై ఆదుర్తి గంగ సత్యనారాయణ మూర్తి పార్థీవదేహాన్ని శుక్రవారం రాత్రి ఆయన స్వగ్రామం కె.గంగవరం తీసుకువచ్చారు. శనివారం ఆ గ్రామానికి జిల్లా అదనపు ఎస్పీ ప్రసాద్ వచ్చి నివాళి అర్పించారు. గ్రామస్తులు, బంధువులు, సహచరులతో మాట్లాడారు. ఇదిలా ఉంటే కోటిపల్లి గ్రామ గోదావరి ఒడ్డున మూర్తి అంత్యక్రియలు నిర్వహించారు. అక్కడ రామచంద్రపురం సీఐ వెంకట నారాయణ, పామర్రు ఎస్సై ఎస్‌కే జానీబాషా ఆధ్వర్యంలో పోలీసు లాంఛనాలను పూర్తి చేశారు.

సముద్రంలో పడి మత్స్యకారుడి మృతి

కొత్తపల్లి: వేటకు వెళ్లిన ఒక మత్స్యకారుడు ప్రమాదవశాత్తూ సముద్రంలో పడి మృతి చెందినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. కొత్తపల్లి మండలం ఉప్పాడ శివారు సూరాడపేటకు చెందిన సూరాడ అప్పారావు (19) ఉప్పాడకు చెందిన సూరాడ యల్లాజీ బోటుపై శుక్రవారం తెల్లవారు జామున వేటకు వెళ్లాడు. సముద్రంలో వేటాడుతుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి పడిపోయాడు. అతని కోసం తోటి మత్స్యకారులు గాలించగా తాతారావు బోటు వలకు చిక్కాడు. అప్పారావు మృతదేహాన్ని శనివారం తెల్లవారు జామున అమీనాబాద్ తీరానికి తీసుకువచ్చారు. దీనిపై ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సామర్లకోట: మాధవపట్నంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కడి బస్టాండ్ వద్ద ఉన్న ఆలయంలో రేకుల షెడ్ రాక్‌కు పంచెతో ఉరి వేసుకున్న విషయాన్ని గ్రామస్తులు గుర్తించి సామర్లకోట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఉరి వేసుకున్న వ్యక్తి మోకాళ్లు నేలకు తాకి ఉండటంతో పలు అనుమానాలకు తావిస్తుంది. తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న తల్లి సంకర రత్నవతి సంఘటనా ప్రదేశానికి చేరుకుంది. తన కుమారుడు రాంబాబు (48) కొంత కాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతుండడతో మాధవపట్నంలోని గ్లోబల్ ఆస్పత్రిలో వైద్యం చేయిస్తున్నామని పోలీసులకు తెలిపింది. రోజూ కొమరిగిరి వెళ్లి రావడం ఆర్థిక ఇబ్బందుల కారణంగా గ్రామంలో ఉన్న బస్ షెల్టర్‌లో ఉంటూ రోజూ డాక్టర్‌తో ఇంజెక్షన్ చేయిస్తున్నట్లు చెప్పింది. శుక్రవారం సాయంత్రం తన కుమారుడిని అక్కడే ఉండమని చెప్పి కొమరిగిరిలో శనివారం పింఛను తీసుకోవడానికి వెళ్లినట్లు సత్యవతి చెప్పింది. ఇంతలో ఇలా జరిగినట్లు వివరించింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి తోట సత్యనారాయణ ఫిర్యాదు మేరకు సీఐ కృష్ణభగవాన్ కేసు నమోదు చేశారు.



సచిన్‌కు బీసీసీఐ 'జీవిత సాఫల్య' పురస్కారం

మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 'జీవిత సాఫల్య' పురస్కారం అందజేసింది. ముంబైలో శనివారం జరిగిన బీసీసీఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధ్యక్షుడు జై షా చేతుల మీదుగా సచిన్ ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. క్రికెట్లో దేశానికి అందించిన విశేష సేవలకు గుర్తింపుగా భారత తొలి కెప్టెన్ కల్నల్ సీకే నాయుడు పేరు మీదుగా 1994 నుంచి ఈ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును ప్రదానం చేస్తున్నారు.

పసిడి పతకం నెగ్గిన పల్లవి

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. శనివారం జరిగిన మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 71 కేజీల విభాగంలో సనాపతి పల్లవి పసిడి పతకం సొంతం చేసుకుంది. పల్లవి మొత్తం 212 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. పల్లవి స్నాచ్‌లో 94 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 118 కేజీలు బరువెత్తింది. శుక్రవారం పురుషుల 67 కేజీల విభాగంలో నీలంరాజు ఆంధ్రప్రదేశ్‌కు తొలి బంగారు పతకాన్ని అందించాడు.





కేలా రెనెకె
నికీ ప్రసాద్

ఒకటే లక్ష్యం... రెండో ప్రపంచకప్

కౌలాలంపూర్: రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా గడ్డపై జరిగిన మొట్టమొదటి అండర్-19 టి20 ప్రపంచ కప్‌లో భారత అమ్మాయిల జట్టు జగజ్జేతగా అవతరించింది. రెండేళ్ల తర్వాత అదే ప్రపంచకప్‌ను నిలబెట్టుకునేందుకు ఈసారి దక్షిణాఫ్రికా జట్టుతో టీమిండియా ఫైనల్ సంగ్రామానికి సిద్ధమైంది. అజేయంగా తుది పోరుకు అర్హత సాధించిన నికీ ప్రసాద్ నాయకత్వంలోని భారత అమ్మాయిల జట్టు విజయవంతంగా 'రెండో ప్రపంచకప్ మిషన్' పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉంది. భారత్ మాదిరిగానే ఓటమి లేకుండా ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా జట్టు వరల్డ్‌కప్ ముచ్చట తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో జోరు మీదున్న రెండు అజేయ జట్ల మధ్య నేడు జరిగే అండర్-19 ప్రపంచకప్ టైటిల్ పోరుపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈసారీ భారత్ జైత్రయాత్ర కొనసాగుతుందా! లేదంటే కొత్త చాంపియన్ ఆవిర్భవిస్తుందా! మరి కొన్ని గంటల్లో తేలిపోతుంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ వనరులతో పూర్తిస్థాయి ఆల్‌రౌండ్ సామర్థ్యంతో ఉన్న టీనేజ్ టీమిండియాను ఎదుర్కోవడమే ఎవరికైనా అతిపెద్ద సవాల్. ఇక అలాంటి అభేద్యమైన జట్టును ఓడించాలంటే మాత్రం దక్షిణాఫ్రికా మైదానంలో పెద్ద 'ప్రపంచ' యుద్ధమే చేయాలనడంలో అతిశయోక్తి లేదు!

నేడు మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్ టైటిల్ పోరు

- దక్షిణాఫ్రికాతో భారత్ 'ఢీ'
- ఓటమి లేకుండానే రెండు జట్లు ఫైనల్లోకి
- త్రిష, కమలినిలపై దృష్టి
- మధ్యాహ్నం 12 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఆ ఇద్దరిని కట్టడి చేస్తే...

తెలంగాణ స్టార్ బ్యాటర్ గొంగడి త్రిష! మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో తనను విస్మరించిన ఫ్రాంచైజీల కళ్లకు కట్టుకున్న గంతల్ని తన అసాధారణ బ్యాటింగ్‌తో విప్పేసింది. ఇప్పుడు 'ఫైనల్ మిషన్' ముంగిట అందరి దృష్టి ఆమెపైనే ఉంది. ఈ టోర్నీలో ఓపెనర్ త్రిష ఫామ్, క్రీజులో ఆమె కనబరుస్తున్న పోరాటపటిమ ప్రత్యర్థి బౌలర్లకు కఠిన సవాళ్లు విసురుతున్నాయి. మరో ఓపెనర్ కమలిని, సనిక చాల్కేలతో కూడిన భారత బ్యాటింగ్ విభాగం పటిష్టంగా ఉంది. దక్షిణాఫ్రికా విజయంపై ఆశలు పెంచుకోవాలంటే మాత్రం ముఖ్యంగా త్రిష, కమలినిలను తక్కువ స్కోరుకు పరిమితం చేయాల్సి ఉంటుంది. ఈ టోర్నీలో త్రిష 265 పరుగులతో టాప్ స్కోరర్‌గా ఉండగా... కమలిని 135 పరుగులతో మూడో స్థానంలో ఉంది. ఆ తర్వాత భారత్ నుంచి అత్యధిక పరుగులు సనిక చాల్కే (6 మ్యాచ్‌ల్లో 69) చేసింది. భారత బౌలింగ్ విభాగాని కొస్తే ఆయుశి శుక్లా, పారుణిక సిసోడియా, వైష్ణవి శర్మలతో కూడిన స్పిన్ త్రయం విశేషంగా రాణిస్తోంది. సహజంగానే సఫారీలకు స్పిన్ అంటేనే కష్టం. అలాంటి జట్టుపై ఫామ్‌లో ఉన్న ఈ ముగ్గురు స్పిన్నర్లు తప్పకుండా ప్రభావం చూపిస్తారు. అలాగని ఫైనల్‌కు చేరిన సఫారీ జట్టును తక్కువ అంచనా వేయలేం. కేలా రెనెకె కెప్టెన్సీలో దక్షిణాఫ్రికా జట్టు సెమీఫైనల్లో గట్టి ప్రత్యర్థి ఆస్ట్రేలియాను బౌలింగ్‌తో కట్టడి చేసి... బ్యాటింగ్‌తో చుట్టేసింది. జెమ్మా బోతా, లౌరెన్స్, కరబో మెసోలతో కూడిన బ్యాటింగ్ లైనప్, ఆష్లే వాన్‌విక్, ఎన్‌తబిసెంగ్ నిని, శేషిని నాయుడులతో కూడిన బౌలింగ్ దళం కూడా మెరుగ్గా ఉంది.

పిచ్, వాతావరణం

భారత్‌కు బాగా అలవాటైన పిచ్. అటు బౌలింగ్‌కు, ఇటు బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశం ఉంది. సాధారణ వాతావరణమే. వాన ముప్పు దాదాపుగా లేదు.

ఆధిక్యం కోసం ఆఖరి పోరు



ముంబై: ఇప్పటికే సిరీస్ భారత్ చేతికందింది. ఇక మిగిలిందల్లా ఆధిక్యం పెంచుకోవడమే! మూడు వన్డేల సిరీస్‌కు ముందు ఈ చివరి మ్యాచ్ గెలిచి... 4-1తో ఆధిక్యం, ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని టీమిండియా భావిస్తోంది. ఇక ఇంగ్లండ్ పరిస్థితి దీనికి భిన్నం. చేజారిన సిరీస్‌తో ఒత్తిడిలో ఉన్న బట్లర్ బృందం ఇప్పుడు భారత్ ఆధిపత్యానికి గండి కొట్టాలని... ఈ పొట్టి సిరీస్‌లో ఆతిథ్య జట్టు శుభారంభమివ్వగా... విజయంతో ముగింపు తమది కావాలని ఇంగ్లండ్ జట్టు గట్టిగా ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో ఆఖరి పోరులో పైచేయి సాధించేందుకు పర్యాటక జట్టు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమైంది. మొత్తంమీద ఇరుజట్ల మధ్య మరో రసవత్తర పోరుకు నేడు వాంఖెడే స్టేడియం వేదిక కానుంది.

నేడు ఇంగ్లండ్‌తో భారత్ ఐదో టి20 మ్యాచ్

- సంజూ సామ్సన్, సూర్యకుమార్‌లకు మరో అవకాశం
- ఒత్తిడిలో బట్లర్ బృందం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

సంజూ... మెరిపించు!

ఈ సిరీస్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ ఆడాడు. తిలక్ వర్మ గెలిపించే 'షో' చేశాడు. హార్దిక్ పాండ్యా అసలైన ఆటను గత మ్యాచ్‌లో బయటికి తెచ్చాడు. అక్షర్ పటేల్ బంతితో లేదంటే బ్యాటింగ్‌తో జట్టుకు అక్కరకొస్తున్నాడు. అంతెందుకు అరకొరగా... అంటే శివమ్ దూబే 'కన్‌కషన్'తో తుది జట్టులోకి వచ్చిన హర్షిత్ రాణా కూడా మ్యాచ్ గెలిపించే బౌలింగ్ ప్రదర్శన కనబరిచాడు. కానీ టాప్-4లో ఓపెనర్ సంజూ సామ్సన్, కెప్టెన్ సూర్యకుమార్‌ల తోనే జట్టు మేనేజ్‌మెంట్ కలవరపడుతోంది. తర్వాతి ప్రపంచకప్ వేటకు కోచ్ గంభీర్ కోర్ గ్రూపులోని ఆటగాళ్లు ఇలా వరుసగా విఫలమవడం జట్టుకు ప్రతికూలంగా మారింది. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, పాండ్యాలు వెన్నుదన్నుగా నిలుస్తుంటే స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఉన్నపళంగా మ్యాచ్‌ను మలుపుతిప్పే మాయాజాలంతో ఆకట్టుకుంటున్నాడు. రవి బిష్ణోయ్ కూడా ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నాడు.

2-3 లక్ష్యంతో ఇంగ్లండ్

సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లండ్‌కు ఇప్పుడు ఆఖరి పంచ్ మాత్రమే మిగిలుంది. ఇందులో తమ పవర్ చాటుకొని తదుపరి వన్డే సిరీస్‌ను తాజాగా ప్రారంభించాలని బట్లర్ జట్టు అనుకుంటుంది. సాల్ట్ గత మ్యాచ్‌లో టచ్‌లోకి వచ్చినా కొద్దిసేపే క్రీజులో ఉన్నాడు. ఇప్పుడు లయను అందుకుంటే బెన్ డకెట్‌తో ఓపెనింగ్ వికెట్‌కు భారీ ఆరంభం ఇవ్వగలడు. ఇదే జరిగితే... తదుపరి పరుగుల ప్రవాహాన్ని బట్లర్, హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్, జాకబ్ బెథెల్, బ్రైడన్ కార్స్‌లు తీసుకెళ్తారు. ఆర్చర్, సకిబ్ మహమూద్ పేస్‌తో ఆకట్టుకుంటుండగా, స్పిన్‌తో ఆదిల్ రషీద్ నిలకడను ప్రదర్శిస్తున్నాడు. సిరీస్ చేజారినా... సమరంలో పట్టు కోల్పోరాదని ఐదో టి20లో నిరూపించుకోవాలని ఇంగ్లండ్ బృందం చూస్తోంది.

5 వాంఖెడే మైదానంలో ఇప్పటి వరకు భారత జట్టు ఐదు టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో మూడింటిలో గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. చివరి మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టే నెగ్గింది.

పిచ్, వాతావరణం

వాంఖెడే బ్యాటింగ్‌కు అచ్చొచ్చే పిచ్. చాలా మ్యాచ్‌ల్లో, ప్రత్యేకించి టి20ల్లో చేజింగ్ జట్లకు విజయ అవకాశాలిచ్చింది. అలాగని బౌలింగ్ తేలిపోదు. స్పిన్నర్లు ప్రభావం చూపొచ్చు. వాన ముప్పు లేదు.

బడ్జెట్‌లో క్రీడలకు రూ.3,794 కోట్లు

గతం కంటే 351.98 కోట్లు పెంపు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో క్రీడలు, యువజన సర్వీసుల శాఖకు రూ. 3,794.30 కోట్లు కేటాయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆ మేరకు నిధుల్ని కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ. 3442.32 కోట్లు ఇవ్వగా... తాజాగా రూ.351.98 కోట్లు పెంచింది. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమానికే ఈ క్రీడా బడ్జెట్లో ప్రాధాన్యం దక్కింది. గతంలో రూ. 800 కోట్లు కేటాయించగా ఈసారి ఆ మొత్తాన్ని రూ. 1000 కోట్లకు పెంచింది. నికరంగా రూ. 200 కోట్లను హెచ్చింపు చేసింది. జాతీయ క్రీడా సమాఖ్యలకు ఇచ్చే గ్రాంట్లను కూడా పెంచింది. గతంలో సమాఖ్యలకు రూ. 340 కోట్లు ఇవ్వగా తాజా ఆర్థిక సంవత్సరంలో రూ. 400 కోట్లు కేటాయించారు. భారత స్పోర్ట్స్ అథారిటీకి రూ. 830 కోట్లు (గత బడ్జెట్ కంటే రూ. 15 కోట్లు అదనం) ఇవ్వనున్నారు. అథ్లెట్ల పారదర్శకత పోటీ కోసం పాటుపడుతున్న జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) లాబోరేటరీకి రూ. 23 కోట్లు (గతంలో రూ. 18.70 కోట్లు) కేటాయించింది. 1998లో ఏర్పాటు చేసిన జాతీయ స్పోర్ట్స్ అభివృద్ధి నిధి కోసం రూ. 18 కోట్లను యథాతథంగా కొనసాగించినప్పటికీ... క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్వల్పంగా కోత పెట్టింది. పోయిన ఏడాది రూ. 42.65 కోట్లు ఇస్తే ఈసారి రూ. 37 కోట్లకు పరిమితం చేసింది. యువజన సర్వీసులకు భారీగా కోత పెట్టింది. గత బడ్జెట్లో రూ. 55 కోట్లు కేటాయిస్తే ఈసారి కేవలం రూ. 11.70 కోట్లే విదిలించింది. జమ్మూకశ్మీర్‌లో క్రీడా సదుపాయల కల్పన కోసం రూ. 20 కోట్లు ఇవ్వనుంది. గతం కంటే రూ. 14 కోట్లు ఎక్కువగా కశ్మీర్‌లో మౌలిక సౌకర్యాలకు వెచ్చించనుంది.

టోగోపై 2-0 ఆధిక్యంలో భారత్

న్యూఢిల్లీ: డేవిస్‌కప్ ప్రపంచ టీమ్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత్ శుభారంభం చేసింది. టోగో జట్టుతో శనివారం మొదలైన ఈ పోటీలో తొలి రోజు జరిగిన రెండు సింగిల్స్‌లోనూ భారత ఆటగాళ్లు ఆడుతూ పాడుతూ విజయం సాధించారు. ఫలితంగా భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి సింగిల్స్‌లో శశికుమార్ ముకుంద్ 6-2, 6-1తో లియోవా (టోగో)పై నెగ్గగా... రెండో సింగిల్స్‌లో రామ్‌కుమార్ 6-0, 6-2తో సెటోడ్జి (టోగో)ను ఓడించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా


● 'దిల్' రాజు, అనిల్ రావిపూడి, శిరీష్

ఈ సక్సెస్ చాలా పాఠాలు నేర్పింది

''ఇండస్ట్రీలో బడ్జెట్ కాదు.. కథే ముఖ్యం. మేము కూడా కథలని నమ్ముకుని సినిమాలు నిర్మించాం. కొత్త దర్శకులతో తీసినప్పుడు ఎన్ని విజయాలు వచ్చాయో అందరికీ తెలిసిందే. అయితే కాంబినేషన్స్ అంటూ నాలుగైదేళ్లుగా మేం తడబడుతున్నాం. 'సంక్రాంతికి వస్తున్నాం' హిట్‌తో అనిల్ మళ్లీ మాకు ఒక రహదారి వేసి ఇచ్చాడు. ఈ సక్సెస్ నాకు కూడా చాలా పాఠాలు నేర్పించింది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన డిస్ట్రిబ్యూటర్స్ గ్రాటిట్యూడ్ మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''సాధారణంగా డిస్ట్రిబ్యూటర్స్‌కి బ్రేక్ ఈవెన్ అయితేనే సూపర్ హిట్. అయితే వాళ్లు నష్టపోయినప్పుడు కూడా సినిమా సూపర్ హిట్ పోస్టర్స్ పడుతుంటాయి. 90 శాతం ఫెయిల్యూర్స్. కేవలం 10 శాతం మాత్రమే సక్సెస్ ఉండే ఇండస్ట్రీ ఇది. 20 ఏళ్లుగా మాతో ప్రయాణం చేస్తున్న డిస్ట్రిబ్యూటర్స్‌కి ధన్యవాదాలు'' అని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ''సంక్రాంతికి వస్తున్నాం' ఆరు రోజుల్లోనే రూ.100 కోట్లు షేర్ రాబట్టింది. ఓ రీజినల్ ఫిలింకి చూడలేనేమో అనుకున్న రూ. 300 కోట్ల గ్రాస్ నంబర్ మా మూవీతో చూడబోతున్నందుకు హ్యాపీ'' అని తెలిపారు. ''20 ఏళ్ల క్రితం డిస్ట్రిబ్యూటర్‌కి ఉన్న విలువ ఇప్పుడు లేదు. ఇలాంటి సమయంలో వాళ్లు తలెత్తుకునేలా చేసిన సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'' అని శిరీష్ పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూటర్స్ సాయికృష్ణ, రాజేశ్, హరి, శోభన్, ఎల్వీఆర్ మాట్లాడారు.

–'దిల్' రాజు


● 'తంగలాన్'లో విక్రమ్


● 'గామి'లో విశ్వక్ సేన్

అరుదైన గౌరవం

విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'గామి', విక్రమ్ కథానాయకుడిగా చేసిన 'తంగలాన్' సినిమాలకు అరుదైన గౌరవం దక్కింది. 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025'లో ప్రదర్శనకి ఈ చిత్రాలు ఎంపికయ్యాయి. నెదర్లాండ్స్ వేదికగా ఈ నెల 9 వరకూ జరగనున్న ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారత సినిమాలకు చోటు దక్కడం విశేషం. విశ్వక్ సేన్ హీరోగా, చాందినీ చౌదరి హీరోయిన్‌గా రూపొందిన తెలుగు చిత్రం 'గామి'. ఈ చిత్రంతో విద్యాధర్ కాగిత దర్శకుడిగా పరిచయమయ్యారు. కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రం 2024 మార్చి 8న విడుదలైంది. ఈ సినిమాలో విశ్వక్ సేన్ అఘోరాగా నటించారు. ఆయన నటనకు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులు పడ్డాయి. అదే విధంగా విక్రమ్ హీరోగా నటించిన తమిళ చిత్రం 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మాళవికా మోహనన్, పార్వతీ తిరువోతు కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా 2024 ఆగస్టు 15న తమిళంతో పాటు తెలుగులోనూ విడుదలైంది. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమాలో మరోసారి తన నట విశ్వరూపం చూపించారు విక్రమ్. ఇక 'గామి, తంగలాన్'లు 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025' ప్రదర్శనకు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

పల్లెటూరి డిటెక్టివ్


● కిశోర్ శ్రీకృష్ణ, తనికెళ్ల భరణి, మిధున ప్రియ

తనికెళ్ల భరణి ప్రధాన పాత్రలో 'అసుర సంహారం' అనే చిత్రం రూపొందనుంది. కిశోర్ శ్రీకృష్ణ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో మిధున ప్రియ కీలక పాత్ర చేయనున్నారు. శ్రీ సాయి ప్రవర్తిక బోయళ్ల సమర్పణలో శ్రీ సాయి తేజో సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సాయి శ్రీమంత్, శబరీష్ బోయళ్ల నిర్మించనున్న ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. 'క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ చిత్రాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలకి ప్రేక్షకాదరణ ఉంటోంది. ఈ క్రమంలోనే విలేజ్ క్రైమ్ డ్రామాగా 'అసుర సంహారం' రూపొందనుంది. ఈ మూవీలో తనికెళ్ల భరణి విలేజ్ డిటెక్టివ్‌గా ఓ విభిన్నమైన పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మిధున ప్రియ, కెమేరా: బాలు ఏబీసీడీ, సంగీతం: కరీం అబ్దుల్.


స్క్రీన్స్ పెరగడం ఆనందం

– విష్ణువర్ధన్


● విష్ణువర్ధన్, ఆకాశ్ మురళి, స్నేహ

ఆకాశ్ మురళి, అదితీ శంకర్ జంటగా 'పంజా' ఫేమ్ విష్ణువర్ధన్ దర్శకత్వంలో రూపొందిన తమిళ సినిమా 'నెసిప్పాయ'. ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ జనవరి 14న విడుదలైంది. ఈ సినిమాను 'ప్రేమిస్తావా' టైటిల్‌తో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ జనవరి 31న తెలుగులో విడుదల చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో ఆకాశ్ మురళి మాట్లాడుతూ–''తెలుగు పరిశ్రమకు నన్ను ఆహ్వానించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా తెలుగు ప్రేక్షకులకూ నచ్చడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''రిలేషన్‌షిప్ నేపథ్యంలో జరిగే రొమాంటిక్ డ్రామా ఇది. ఈ సినిమాలోని క్రైమ్ ఎలిమెంట్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తుంది. ఆకాశ్ ప్రతిభగలవాడు. యాక్షన్ స్టంట్స్‌ను కూడా తనే చేశాడు. అదితి అద్భుతంగా నటించింది. 'ప్రేమిస్తావా' సినిమాకు స్క్రీన్స్ పెరుగుతున్నాయని మైత్రీవారు చెప్పడం హ్యాపీగా ఉంది'' అని చెప్పారు విష్ణువర్ధన్. ''ఈ సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు సహనిర్మాత స్నేహ.

సస్పెన్స్


● ఆర్పీ పట్నాయక్, సురేశ్

రాంప్రసాద్, జెమినీ సురేష్, కిరీటి, సాయి ప్రసన్న, సాయి కిరణ్, నజియా ఖాన్, అద్వైత చౌదరి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'వైఫ్ ఆఫ్ అనిర్వేష్'. గంగ సప్తశిఖర దర్శకత్వం వహించారు. మహేంద్ర గజేంద్ర సమర్పణలో వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించారు. ఈ సినిమా ఎస్‌కేఎంఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా తెలుగులో రిలీజ్ కానుంది. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు, మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో రూపొందిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మంచి విజయం సాధిస్తుంది'' అన్నారు. వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర మాట్లాడుతూ–''ఓ మిమిక్రీ ఆర్టిస్ట్ తన ఇబ్బందులను తనకు తెలిసిన కళతో ఎలా పరిష్కరించాడు? అనేది దర్శకుడు ఆసక్తిగా తెరకెక్కించారు'' అని తెలిపారు.

సూర్యాపేట్ నేపథ్యంలో....



● ఈశ్వర్, నైనా

'కొత్తగా మా ప్రయాణం' మూవీ ఫేమ్ ఈశ్వర్ హీరోగా, నైనా సర్వర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. రాజేశ్ నాదెండ్ల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అభిమన్యు సింగ్ ప్రధాన పాత్ర పోషించారు. అనిల్‌కుమార్ కాట్రగడ్డ, ఎన్. శ్రీనివాసరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో ఈశ్వర్ మాట్లాడుతూ– ''సూర్యాపేట్ జంక్షన్'కి నేను కథ రాశాను. సూర్యాపేట పరిసరాల్లో జరిగే కథ ఇది. ప్రభుత్వం నుంచి ఉచితాలు తీసుకోవడం వల్ల మధ్య తరగతి ప్రజలు ఎలాంటి ఇబ్బందుల్లో ఇరుక్కుంటున్నారో మా చిత్రంలో చూపిస్తున్నాం'' అన్నారు. ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. రోషన్ సాలూరి, గౌర హరి మంచి సంగీతం ఇచ్చారు'' అన్నారు అనిల్ కుమార్.

ఓటీటీ ఇది చూడొచ్చు

చూసి తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో బాలీవుడ్ చిత్రం ది రోషన్స్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ జీవితమనే చక్రంలో కొందరి వంతు వస్తుంది, కొందరి వంతు ముగుస్తుంది. ముగిసిన వారి జ్ఞాపకాలు మన మనసులో పదిలంగా ఉంటాయి. వారిలో ఎందరో మహానుభావులుంటారు. వారి జ్ఞాపకాలైతే మనం నెమరువేసుకోవచ్చేమో కానీ ఆ కాలంలో వారు పడ్డ కష్టం, ఆనందం కానీ మనకు తెలియవు. అటువంటి వారి జీవిత చక్రానికి వెండి తెర రూపమిస్తే మన ఆనందం అవధులు దాటుతుంది. ఆ కోవకు చెందినదే నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'ది రోషన్స్' టీవీ షో. ఇదో డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి జీవిత చక్రాలకు తెర రూపమే ఈ షో. బాలీవుడ్ దిగ్గజ రోషన్ కుటుంబానికి చెందిన నాటి సంగీత కళాకారులు రోషన్ లాల్ నాగ్రత్ నుండి నేటి తరం నటుడు హృతిక్ రోషన్ వరకు... వారి జీవిత ప్రయాణాన్ని ఎంతో అందంగా చూపించారు ఈ డాక్యుమెంటరీలో. ఓ రకంగా చెప్పాలంటే మనం ఈ షో ద్వారా నాలుగు తరాలు ప్రయాణిస్తాం. ముందుగా రోషన్ కుటుంబం నుండి రోషన్ లాల్ నాగ్రత్ సంగీత ప్రయాణంతో ఈ షో ప్రారంభమై ఆ పై అతని కొడుకు రాజేష్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో సాగి, ఆ తరువాత ఆయన కొడుకు రాకేశ్ రోషన్ నటనా ప్రయాణంతో పాటు ప్రొడ్యూసర్‌గా ఎలా రాణించారు? అన్నది చూపిస్తూ నేటి తరం కథానాయకుడు హృతిక్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో షో ముగుస్తుంది. ఈ షో ద్వారా నాటి బాలీవుడ్ సంగీతం నుంచి నేటి తరం సినిమాల వరకు మనకు తెలియని ఎన్నో రహస్యాలతో పాటు హిందీ చిత్ర పరిశ్రమలోని అప్పటి ఒడిదుడుకులను ఇప్పటి పట్టు విడుపులను సవివరంగా చూపించారు. ఈ రోషన్ కుటుంబానికి బాలీవుడ్ పరిశ్రమలో ఉన్న నాటి, నేటి దిగ్గజాలు తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రేక్షకులకు చెప్పడం మరింత బావుంది. అందుకే 'ది రోషన్స్' చూసి నేర్చుకోదగ్గ, తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ. ఇది ప్రతి సినిమా ప్రేక్షకుడు తమ వ్యక్తిగత లైబ్రరీలో భద్రపరుచుకోదగ్గ డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. వర్త్‌ఫుల్ టు వాచ్.

– ఇంటూరు హరికృష్ణ